

స్టే ఇవ్వకపోవడం అన్యాయం

డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాహుల్ గాంధీపై బిజెపి పెట్టిన అక్రమ పరువు నష్టం కేసులో గుజరాత్ హైకోర్టు స్టే ఇవ్వకపోవడం అన్యాయమని డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసులను, న్యాయవ్యవస్థను అడ్డం పెట్టుకుని రాహుల్ గాంధీని, కాంగ్రెస్ పార్టీని ఇబ్బందులు పెట్టాలనుకోవడం దుర్మార్గమైన చర్యని ఖండించారు. మోడీ అవినీతి, అక్రమాలను పార్లమెంట్ సాక్షిగా ప్రశ్నించిన రాహుల్‌పై బిజెపి కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నాయకులపై దేశవ్యాప్తంగా బిజెపి అక్రమ కేసులు పెట్టి వేధించడం దారుణమన్నారు. బిజెపి తాటాకు చప్పుళ్లకు కాంగ్రెస్ పార్టీ భయపడదని తేల్చిచెప్పారు. మోడీ ప్రభుత్వ నిరంకుశ, నియంతృత్వ పాలనకు త్వరలోనే దేశ ప్రజలు చరమగీతం పాడుతారని హెచ్చరించారు.

ప్రాధాన్యతా భవనాలను ప్రారంభించాలి

- ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తాం
- తోటపల్లి భూసేకరణ వెంటనే పూర్తిచేయాలి
- మంత్రి బొత్స సత్యనారాయణ
- జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చ
- విజయనగరం మండలంలో మరో పిహెచ్‌సికి తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ; చిత్రంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విజయగరం ప్రతినిధి

ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలను వెంటనే ప్రారంభించాలని విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించి అందుబాటులోకి తేవాలన్నారు. నిర్మాణ దశలోనూ, ఆగిపోయిన వాటికి సంబంధించి నియోజకవర్గాల వారీగా సమీక్షా సమావేశాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. విజయనగరం మండలంలో మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని, గరుగుబిల్లి, బలిజిపేట మండలాలను పార్వతీపురం విద్యుత్తు డివిజన్ పరిధిలో చేర్చడానికి సభ తీర్మానించింది. ఈ ఏడాది ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, వ్యవసాయ శాఖ, జలవనరుల శాఖలపై సమీక్ష సందర్భంగా మంత్రి బొత్స చెప్పారు. గతేడాదితో పోలిస్తే, ఈ ఏడాది జూన్‌లో ఉమ్మడి జిల్లాలో సుమారు 50 శాతం వరకు లోటు వర్షపాతం ఉన్నా, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏ మండలానికైనా అదనంగా విత్తనాలు కావాలంటే సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. తోటపల్లి ప్రాజెక్టు భూసేకరణను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కాలువల పనులు పూర్తి చేయాలని సూచించారు.

● డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర మాట్లాడుతూ చెరువు మధ్యలోనుంచి కాలువ తవ్వడం వల్ల ఇబ్బంది పడే అవకాశం ఉందని, అటువంటి వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

● జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టు నుంచి 40 రోజుల ముందుగానే నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. శివారు భూములకు నీరు చేరేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. వర్షాలు బాగా కురిస్తే, ఈ నెలాఖరుకు వెంగళరాయసాగర్ నుంచి నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఇ-క్రాప్ నమోదులో ఎక్కడా తప్పులు జరగకుండా చూడాలని సూచించారు. ● ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ శృంగవరపుకోటలో చిలకలగెడ్డ, జెఎ ఛానల్‌లో భూ ఆక్రమణలు తొలగించాలని, అందుకు రైతులు కూడా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ● ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ బిసి సంక్షేమ వసతిగృహాల్లో ఇన్‌ఛార్జి వార్డెన్ల వల్ల ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావించారు. ● విద్యుత్తు, పౌర సరఫరాలు, వైద్యారోగ్యం తదితర అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి, విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, సభ్యులు, విజయనగరం, పార్వతీపురం జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



రాములవలస, లోచర్లలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు మంజూరు చేయాలి. మధుములు, స్లూయిస్‌లు బాగు చేయాలి.

- బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు



రేగిడిగెడ్డలో 14 మంది రైతులకు పరిహారం పెండింగ్‌లో ఉంది. వెంటనే దానిని విడుదల చేయాలి. కాలనీ ఇళ్లే కాకుండా, మా నియోజకవర్గంలో వ్యక్తిగత ఇళ్లను కూడా మంజూరు చేయాలి. పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్ల బిల్లులు చెల్లించాలి.

- కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



ఎమ్మెల్యే అప్పలనరసయ్య

● సమావేశంలో గజపతినగరం ఎమ్మెల్యే అప్పలనరసయ్య మాట్లాడుతూ చెరువులు, కాలువల పనులన్నీ పూర్తయ్యాకే నీటిని విడుదల చేయాలన్నారు. గంట్యాడ మండలంలో జాతీయ రహదారి నిర్మాణ సమయంలో సాగునీటి కాలువలను మూసివేశారని, దీనిపై చర్య తీసుకోవాలని కోరారు. దీనిపై సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

● గంట్యాడ మండలం డికె పర్తిలో పొజిషన్ పట్టాలు ఇవ్వకపోవడంతో పేదలు ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నారని ఆ మండల జెడ్‌పిటిసి సభ్యులు వర్రి నర్సింహమూర్తి.. సభ దృష్టికి తెచ్చారు. ముందుగా పట్టాలు ఇచ్చారని, ఇళ్లు కట్టబోతే అడ్డు చెబుతున్నారని ఎమ్మెల్యే అప్పలనరసయ్య అన్నారు.

తాగునీటి సమస్యపై చర్చ

● ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని పాచిపెంట, తెర్లాం ఎంపిపిలు సహా జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ● తన నియోజకవర్గ పరిధిలో రూ.200 కోట్ల మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఎస్.కోట ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ● ఎంపి బెల్లాన మాట్లాడుతూ కొన్నిచోట్ల వేసిన కొళాయిల ట్యాపులు విరిగిపోతున్నాయని, పనులు సక్రమంగా పూర్తి చేయలేదని చెప్పారు. ● మంత్రి బొత్స మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని జెజెఎం పనులకు పిలిచినప్పటికీ, టెండర్లు దాఖలు కాలేదని వివరించారు. సవరించిన కొత్త ఎస్‌ఎస్‌ఆర్ ధరలతో తాజాగా మరోసారి టెండర్లు పిలిచి, పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



హాజరైన సభ్యులు



ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రాజాం, రేగిడి ఆమదాలవలస మండలాల్లో ఇళ్ల నిర్మాణం చేసినప్పటికీ బిల్లులు రాలేదని చెప్పారు. ఇళ్లు కట్టుకొని నివాసం ఉంటున్న పేదలకు పొజిషన్ పట్టాలు ఇవ్వాలని మంత్రి బొత్స అధికారులను ఆదేశించారు. బిల్లులు ఎక్కడా పెండింగ్ లేవన్నారు. డిసెంబరు నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు.

ఎట్టకేలకు గిరిజన వర్సిటీ అడుగులు

- 561 ఎకరాల్లో ఏర్పాటుకు సన్నాహాలు
- పూర్తయిన భూసేకరణ ప్రక్రియ
- యూనివర్సిటీ యాజమాన్యానికి భూమి అప్పగింత
- చినమేడపల్లి, మర్రివలస రైతులకు రూ.30.57 కోట్ల పరిహారం చెల్లింపు
- కురుపాం సభలో సిఎం ప్రకటన తర్వాత మరింత జోరందుకున్న ప్రక్రియ



యూనివర్సిటీ భూములను పరిశీలిస్తున్న కేంద్రబృందం (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు ఎట్టకేలకు అడుగులు పడుతున్నాయి. సుమారు మూడేళ్ల క్రితమే అడ్మిషన్లు ప్రారంభించినప్పటికీ శాశ్వత భవనం నిర్మించలేదు. రాష్ట్ర విభజనలో భాగంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో గిరిజన వర్సిటీ ఏర్పాటుకు అప్పట్లో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం విదితమే. దీని ఏర్పాటుకు తొలుత 'అదుగో ఇదిగో..' అంటూ నెట్టుకొచ్చింది. గతంలో టిడిపి, నేటి వైసిపి ప్రభుత్వాలు కూడా భూసేకరణ పేరుతో కాలం గడిపాయి. టిడిపి ప్రభుత్వంలోనే కొత్తవలస మండలం రెల్లి రెవెన్యూ పరిధిలో భూమి సేకరించి, నష్టపరిహారం కూడా చెల్లించినప్పటికీ వైసిపి వచ్చాక రద్దుచేసింది. నాలుగైదు చోట్ల భూమి పరిశీలించి చివరికి మెంటాడ మండలం కుంటినవలస మధుర గ్రామం చినమేడపల్లి, దత్తిరాజేరు మండలం మర్రివలసలో భూమిని గుర్తించారు. అనేక ఊగిసలాటల తరువాత కేంద్ర ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయం నిర్మాణానికి 561.91 ఎకరాల భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. ఈ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.37.45 కోట్లు కేటాయించింది. సహజ సిద్ధమైన చెరువులు, నీటి గుంతలు పోగా నిర్మాణానికి అనువైన 519 ఎకరాల భూమిని ఈ నెల ఆరో తేదీన యూనివర్సిటీ యాజమాన్యానికి జిల్లా యంత్రాంగం అప్పగించింది. 'త్వరలోనే జిల్లాకు మళ్లీ వస్తాను.. గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనలో భాగస్వామ్యం అవుతాన'ంటూ ఇటీవల కురుపాం సభలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రకటించటంతో ఇక్కడ ప్రక్రియలో మరింత వేగం పెరిగింది. శంకుస్థాపనకు సెప్టెంబర్‌లో సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రావచ్చనే చర్చ సాగుతోంది.

80 శాతం భూమి ప్రభుత్వానికి చెందినదే

యూనివర్సిటీ నిర్మాణానికి సంబంధించి మెంటాడ, దత్తిరాజేరు మండలాల పరిధిలో సేకరించిన భూమిలో దాదాపు 80 శాతం ప్రభుత్వ భూమే ఉండటం గమనార్హం. మెంటాడ మండలం చినమేడపల్లి పరిధిలో 155.44 ఎకరాలు, దత్తిరాజేరు మండలం మర్రివలస పరిధిలో 391.17 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందినదే. రెండు గ్రామాల రైతులకు చెందిన జిరాయితీ భూమి 67.30 ఎకరాలు మాత్రమే ఉంది. మొత్తం భూమిలో 42.88 ఎకరాలు.. చెరువులు, నీటి గుంతల రూపంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు చెప్పారు. సహజ సిద్ధంగా ఉన్న చెరువులను, నీటి గుంతలను అలాగే ఉంచి నిర్మాణాలు చేపడతారని అధికారులు పేర్కొన్నారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ 265 ప్రకారం భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

పెదమేడపల్లి, మర్రివలస గ్రామాలకు చెందిన 99 రైతులు 67.30 ఎకరాల భూమిని అప్పగించగా ప్రభుత్వం రూ.10.47 కోట్ల పరిహారం చెల్లించింది. భూసేకరణ సమయంలో డి-పట్టాదారులు కూడా తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మంత్రి బొత్స చొరవతో 279 మంది డి-పట్టాదారులకు ప్రభుత్వం రూ.13.92 కోట్లు పరిహారం అందించినట్టు అధికారులు చెబుతున్నారు. ఎలాంటి హక్కు పత్రాలు లేకుండా అనుభవదారులైన రైతులకు కూడా రూ.5.58 కోట్లు చెల్లించినట్టు వివరించారు. మొత్తం భూసేకరణ ప్రక్రియ, ఇతర అవసరాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ.37.45 కోట్లు కేటాయించింది. ఇందులో ఇప్పటికే భూములు అప్పగించిన రైతులకు రూ.30.57 కోట్లు పరిహారం కింద చెల్లించింది.

రైతులు, అధికారుల సహకారంతో సజావుగా ప్రక్రియ



అనుకున్న సమయానికి భూమిని అప్పగించడంలో అధికారులు తీవ్ర కృషి చేశారు. చినమేడపల్లి, మర్రివలస గ్రామాల రైతులు కూడా సానుకూలంగా స్పందించి పూర్తి సహకారం అందించారు. ముందుకు వచ్చిన సమస్యలను పరిష్కరించుకుంటూ భూసేకరణ చేపట్టాం. అర్హత కలిగిన రైతులందరికీ నిబంధనల ప్రకారం నష్ట పరిహారం చెల్లించాం.

- ఎస్.నాగలక్ష్మి, కలెక్టర్, విజయనగరం జిల్లా



జామిలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు

- ఈ నెల 1 నుంచి అమలు
- జామిలో వెలసిన ప్రయివేటు చెక్ పోస్ట్
- ఇళ్ల నిర్మాణాలకు భారీ షాక్

మైనింగ్ రాయల్టీ.. ప్రయివేటుపరం

ప్రజాశక్తి-జామి

గనులను ప్రయివేటు పరం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సామాన్యుల నడ్డి విరగనుంది. ఈ నెల ఒకటి నుంచి మైనింగ్ రాయల్టీలు ప్రయివేటు సంస్థలకు అప్పగించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు చెక్ పోస్టులు వెలిసాయి. ప్రధానంగా క్వారీల నుంచి బయటకు తరలించే మెటీరియల్‌పై ఆ సంస్థ బిల్లు వసూలు చేయనుంది. ఈ ప్రక్రియ ఈ నెల ఒకటో తేదీ నుంచి లాంఛనంగా ప్రారంభమైంది. దీంతో ఇక నుంచి గృహ నిర్మాణంపై పెనుభారం పడనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో సర్కారు ఖజానాకు ఆదాయం కొంత పెరుగుతున్న తరుణంలో... ఆ భారం సామాన్య, మధ్య తరగతి ప్రజలపై తీవ్రంగా పడుతోంది.

జిల్లా మైనింగ్‌లో ప్రధానమైనది రోడ్డు మెటల్ క్వారీలు. జిల్లా వ్యాప్తంగా 200కు పైగా ప్రభుత్వం లీజులు మంజూరు చేసింది. అయితే వీటిలో అత్యధిక క్వారీలు రెన్యువల్ జరగక మూత బడ్డాయి. అరకొరగా నిర్వహిస్తున్న క్వారీలు కూడా సంక్షోభంలో ఉన్నాయి. ప్రభుత్వ విధానాల్లో భాగంగా క్వారీలకు ఈ దుస్థితి పట్టిందనే చెప్పాలి. తాజాగా ప్రభుత్వం మైనింగ్ రాయల్టీ వసూలు బాధ్యత ప్రయివేటు సంస్థకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. జిల్లాలో మొత్తం క్వారీల రాయల్టీ వసూళ్లను శ్రీ రాఘవేంద్ర కనస్ట్రక్షన్ ప్రయివేట్ లిమిటెడ్ అనే సంస్థకు అప్పగించింది. సుమారుగా ఏడాదికి రూ.9 కోట్లపైన అమ్మేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి రాయల్టీ వసూలు బాధ్యత ప్రభుత్వమే నిర్వహించేది. లీజు మంజూరైన క్వారీ నుంచి తవ్విన మెటీరియల్‌కు తప్పకుండా క్యూబిక్ మీటరుకు కొంత చొప్పున రాయల్టీ బిల్లు చెల్లించాలి. కానీ ఈ ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగేది. కానీ, ఈ నెల ఒకటి నుంచి మైనింగ్ రాయల్టీలు ప్రయివేటు సంస్థకు అప్పగించడంతో పరిస్థితి మారింది. ప్రభుత్వం ప్రయివేటు సంస్థకు అప్పగించి, ప్రతి లోడుకు బిల్లు చెల్లించాల్సి వస్తున్న నేపథ్యంలో సామాన్యుల ఇళ్ల నిర్మాణాలకు వాడే పిక్క, రాయి ధరలు అమాంతంగా పెరిగిపోయే అవకాశం ఉంది. వాస్తవానికి గతంలో 20 ఎంఎం పిక్క యూనిట్ రూ.3 వేలకు దొరికేది. కానీ ప్రయివేటు రాయల్టీ కలుపుకుని రూ.3,500 నుంచి రూ.4 వేల వరకు పెరిగే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే సామాన్యులపై భారం పడనుందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

విద్యార్థులకు సత్కారం

విజయనగరం టౌన్ : కోరుకొండలోని వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో వివిధ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుక్రవారం సత్కారాలు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన బాలల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు మాట్లాడుతూ నేటి సమాజంలో పిల్లలు, వారి బాధ్యతలను వివరించారు. నూతన సాంకేతికతను ఎంతవరకు పిల్లలకు ఉపయోగించాలో వివరించారు. స్టేట్ టాపర్‌గా నిలిచిన కె.నిహాల్ వర్మకు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమములో పాఠశాల డైరెక్టరు తోట వీరాస్వామి, ప్రిన్సిపల్ బి.లక్ష్మణమూర్తి, ఒలింపియాడ్ కన్వీనర్ బి.శ్రీరామ్మూర్తి, వైస్ ప్రిన్సిపల్ శ్రీను, స్వప్న పాల్గొన్నారు.

ఈతపై చైతన్యానికే జలాసనాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈత వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు చైతన్యం కలిగించేలా ఈ నెల 11న జాతీయ స్విమ్మింగ్ పూల్ డే సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జలాసన ప్రదర్శన చేపడుతున్నారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఈశ్వర్ కౌశిక్ తెలిపారు. అన్ని క్రీడా సంఘాల తరపున ఈ ప్రదర్శనను ఆహ్వానిస్తూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని వెల్లడించారు. శుక్రవారం స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో సెట్విజ్ సిఇఒ బి.రాంగోపాల్, వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత బిజీ జీవితాల్లో ఈత అనేది అందరికీ ఆవశ్యకమని.. క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల మానసికంగానూ, శారీరకంగానూ ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. అందులో భాగంగానే ఆక్వా స్విమ్మింగ్ పూల్ ఆధునికీకరణతోపాటు కేవలం మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా పార్కు వద్ద స్విమ్మింగ్ పూల్‌ను కోలగట్ల ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దీనిపై ప్రజలను చైతన్యం చేసేందుకు స్వయంగా ఈనెల 11న కంటోన్మెంట్లోని ఆక్వా స్టేడియం వద్ద స్విమ్మింగ్ పూల్‌లో సుమారు గంటపాటు ఏకధాటిగా నీటిపై తేలియాడేలా జలాసన ప్రదర్శన చేపడుతున్నారని వివరించారు. అనంతరం జలాసన ప్రదర్శనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భగవాన్ దాస్, హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి మల్లేశ్వరరావు, రెజ్లింగ్, అథ్లెటిక్, తైక్వాండో, బాస్కెట్ బాల్, టెన్నిస్ బాల్, ఆటియా పాటియా, ఖోఖో, అండర్ - 17, 19 సంఘాల కార్యదర్శులు లక్ష్మణరావు, బాబ్జి, లీలా, చారి, రాజీవ్, రవికుమార్, సత్యనారాయణ, కృష్ణ, ఎల్.వి.రమణ, చీఫ్ కోచ్ రమణ పాల్గొన్నారు.

సంత నిర్వాహకులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజాం పశువుల సంతలో జరిగిన హత్యకు పరోక్షంగా కారణమైన సంత నిర్వాహకులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం చిన్నపల్లివారి వీధిలో ఆ సమాఖ్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లైసెన్సులు, నిబంధనలు, అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న ఈ సంత మూసివేయాలని పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. దీనివల్ల నిండు జీవితం బలైందని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో సమాఖ్య జిల్లా నాయకులు డి.ఈశ్వరరావు, బోని గణేష్, రేగిడి నారాయణరావు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించండి

మహిళా, శిశు సంక్షేమశాఖకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం

మహిళా, శిశు సంక్షేమంలో ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో సిబ్బంది మరింత సమర్థవంతంగా పనిచేసేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి.. ఆ శాఖ ప్రాంతీయ అధికారులకు సూచించారు. ముఖ్యంగా అంగన్‌వాడీల ద్వారా మహిళలు, పిల్లలకు సక్రమంగా పోషకాహారం అందించడం వల్ల ఆరోగ్యకరంగా రూపొందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆర్‌జెడి చిన్మయీదేవి శుక్రవారం కలెక్టర్ నాగలక్ష్మిని కలెక్టర్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో అంగన్‌వాడీల నాడు-నేడు పనులు, కార్యకర్తల నియామకాలపై కలెక్టర్ ఆమెతో చర్చించారు. అనంతరం తమ శాఖ సిబ్బందితో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. నాడు-నేడు పనుల నిర్వహణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, ప్రిస్కూల్ అటెండెన్స్, స్పాట్ ఫీడింగ్ అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశాల్లో ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్‌జెడి చిన్మయీదేవి

సురక్షతో సత్వర సేవలు

మేయర్ విజయలక్ష్మి



ధ్రువపత్రాలు అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులైన ప్రతిఒక్కరికీ సత్వర సేవలు అందుతాయని మేయర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం 11వ డివిజన్ షాదీఖానా వద్ద 13, 14, 15 సచివాలయాలకు, 9వ డివిజన్ సుంకర వీధిలో 10, 11, 12 సచివాలయాలకు సంబంధించిన లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. షాదీ ఖానా వద్ద మేయర్, సుంకరవీధిలో కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అవినీతి రహితంగా, లంచగొండితనం లేకుండా నేరుగా 11 రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, కార్పొరేటర్లు రేగాన రూపాదేవి, సయ్యద్ గౌస్, వైసిపి నాయకులు వెంపడాపు శ్రీనివాసరావు, బొంగ భానుమూర్తి, పిలక శ్రీనివాసరావు, చిట్టెల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు జిల్లా పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 10, 11 తేదీల్లో జిల్లాలో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు పర్యటించనున్నారు. అందులో భాగంగా క్షేత్ర స్థాయి తనిఖీలు చేపట్టనున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం అమలు, మహిళా శిశు అభివృద్ధి పథకాల (ఐసిడిఎస్) కార్యక్రమాలపై తనిఖీలు నిర్వహిస్తారు.

'నవజీవన్' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా వృద్ధులకు, అనాథ పిల్లలకు నవజీవన్ సంస్థ అందిస్తున్న సేవలను డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అభినందించారు. ఎంతోమందిని ఆదుకుంటున్న సంస్థ ఫౌండర్ కె.శ్రీధర్ ఆచార్య సేవలను కొనియాడారు. శుక్రవారం స్థానిక కనపాకలోని వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన అన్నలక్ష్మి నిత్యావసర సరుకుల పంపిణీకి కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒంటరి మహిళలను గుర్తించి, అన్నలక్ష్మి పథకం కింద ప్రతి నెలా తొమ్మిది రకాల నిత్యావసర సరకులను అందించడం హర్షణీయమన్నారు. వృద్ధులను, పిల్లలను ఒకే చోట ఉంచడం వల్ల కుటుంబంలోని బాంధవ్యాలను దగ్గర చేసినట్లు అవుతుందని తెలిపారు. ఇక్కడ ఆశ్రయం పొంది, చదువుకుంటున్న పిల్లలు.. భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదిగి, ఒక్కొక్కరూ కనీసం ఇద్దరు పిల్లలకైనా చదువు చెప్పించాలని కోరారు. అనంతరం పలువురికి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు లక్ష్మణరావు, విజయ పాజిటివ్ నెటవర్క్ ప్రతినిధి చౌదరి, మజ్జి పద్మావతి, మాతృభూమి సేవా సంఘం ప్రతినిధి ఇప్పలవలస గోపి, నటుడు రాంబార్కి రామానాయుడు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటంపై విచారణ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని గొల్జాం పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్ కోటరావు కుటుంబీకుల ఉపాధి పనులకు వెళ్లకుండా మస్తర్లు వేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై 'ఫీల్డ్ అసిస్టెంట్ చేతివాటం' అనే శీర్షికతో గతనెల 29న ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. రాష్ట్ర అంబుడ్స్ పర్సన్ ఎన్ అన్నపూర్ణ శుక్రవారం గొల్జాం గ్రామ సచివాలయాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. ఆమె విచారణలో కోటరావు కుటుంబీకులు తీర్థయాత్ర పేరిట కాశీకి వెళ్లిన తేదీలలో మస్తరులు వేసి ఉపాధి నిధులను స్వాహా చేసినట్లు తేటతెల్లమైంది. సంబంధిత మేట్లు పొరపాటున వేశామని అంగీకరించారు. ఈ వార్తకు సంబంధించిన వివరాలు ఎవరు చెప్పారంటూ సభాముఖంగా విలేకరులను ప్రశ్నించడం శోచనీయం. విచారణ నివేదికను అధికారులకు తెలియపరుస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ విజయలక్ష్మి, సచివాలయ కార్యదర్శి ప్రసాదరావు, ఉపసర్పంచ్ తూర్పాటి శివాజీ, అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పెరటి కోళ్లు పంపిణీ

ప్రజాశక్తి- బొండపల్లి

స్థానిక వైకెపి కార్యాలయం వద్ద శుక్రవారం ఎంపిపి చల్ల చలంనాయుడు మహిళలకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఎపిఎం సులోచనా దేవి ఆధ్వర్యంలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని పొందవచ్చు అన్నారు. లబ్ధిదారులు పెరటి కోళ్ల పెంపకం ద్వారా పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు.

సచివాలయానికో ఆర్‌బికె

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పట్టణంలోని ఉన్న ఐదు సచివాలయాలకు ఐదు ఆర్‌బికెలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించామని సర్పంచ్ సంతోషి కుమారి తెలిపారు. శుక్రవారం సుబ్బిరామిరెడ్డి కల్యాణ మండపం వద్ద పంచాయతీ ఇంచార్జ్ ఇఒ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో గ్రామ అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఒకటో సచివాలయం పరిధిలో జనాభా ప్రాతిపదికన ఆశా వర్కర్లను పెంచాలని కోట్టం పిహెచ్‌సికి లేఖ రాశామన్నారు. వర్షాలు కారణంగా పట్టణం జలమయం కాకుండా గ్రామంలోని కలిగ గెడ్డ, పుణ్యగిరి గెడ్డల పూడికలు తీయించి గెడ్డలను లోతు చేయించడానికి గ్రామసభలో ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోపాడ కుమార్, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నీటి నిల్వల్లేకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

మన పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకుంటే దోమలను నివారించవచ్చునని హెల్త్ సబ్ యూనిట్ ఆఫీసర్ బి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని నాలుగో సచివాలయ పరిధి బాలాజీ నగర్‌లో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి ఫీవర్ సర్వే నిర్వహించడంతోపాటు అక్కడ వార్డు సభ్యులందరికి ఆరోగ్య సూత్రాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎస్ రాజశేఖర్, పిహెచ్‌సి సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్ శంకర్, ఎంఎల్‌హెచ్‌పి, ఆశాలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక కోర్టును పరిశీలించిన జడ్జి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని లక్ష్మీపేట ప్రత్యేక కోర్టును శ్రీకాకుళం కోర్టు జడ్జి ఫణి కుమార్ శుక్రవారం పరిశీలించారు. పోలీసులతో కలిసి అక్కడ ఉన్న రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాజాం రూరల్ సిఐ హెచ్ ఉపేంద్ర రావు, తహశీల్దార్ డి ఐజాక్, వంగర ఎస్ఐ ఆర్ జనార్దన రావు పాల్గొన్నారు.

హోటల్లో గృహ వినియోగ గ్యాస్ పట్టివేత

బొబ్బిలిరూరల్ : స్థానిక గణేష్ హోటల్లో గృహవినియోగ గ్యాస్ సిలండర్లు వాడుతుండగా తహశీల్దార్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో అధికారులు శుక్రవారం దాడి చేసి నాలుగు సిలెండర్లు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ వినియోగ గ్యాస్‌ను హోటళ్లలో వాడినందుకు 6ఏ కేసు నమోదు చేసామన్నారు. ఆయనతో పాటు సివిల్‌సప్లై సాయిక్రుష్ణ, విఆర్‌ఒ సింహాచలం పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

బొబ్బిలి: జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు అన్నారు. స్థానిక సంగమేడి 3,7వార్డుల, వంతెన రోడ్ 19,20 వార్డు సచివాలయాల్లో శుక్రవారం ఆయన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం నేరుగా ప్రజల వద్దకే పాలన అందిస్తున్న జగనన్న సురక్ష ద్వారా 11 రకాల ధ్రువపత్రాలు అర్హత ఉన్న ప్రజలకు ఉచితంగా అందిస్తోందన్నారు. అర్హులైన కుటుంబాలకు మేలు చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్ గొలగాని రమాదేవి, 7వ వార్డు కౌన్సిలర్ దిబ్బ సునీల్ గోపి, పట్టణ కన్వీనర్ గోపాల్ రావు, ఇంటి గోపాల్ రావు, బూత్ ఇన్‌ఛార్జ్ ఇంటి పార్వతి, పట్టణ జెసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, వైసిపి నాయకులు గండి నక్షత్ర, వాసంతి, మున్సిపల్ సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

మద్దువలస మెయిన్ కెనాల్ పనుల పరిశీలన

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ అక్కన్న అగ్రహారం గ్రామంలో మడ్డువలస మెయిన్ చానల్ పనులను ఎపిఒ సంజీవరావు హరినాథ్ శుక్రవారం పరిశీలించారు. చానల్‌లో పని చేస్తున్న 128 మంది వేతనదారుల మస్టర్ తనిఖీ చేశారు. వేతనదారులతో మాట్లాడుతూ రెండు పూటలా పనిచేయాలని సూచించారు. కొలతల ప్రకారం పనిచేసినట్లయితే రూ.272 కూలి వస్తుందన్నారు. ఈయనతో ఫీల్డ్ అసిస్టెంట్ స్వామినాయుడు, మేటు, వేతనదారులు ఉన్నారు.

'పనులు చేపట్టని ఇళ్లు రద్దు చేస్తాం'

కొత్తవలస: హౌసింగ్ కాలనీ మంజూరై నేటి వరకు పనులు ప్రారంభించని ఇళ్లను రద్దు చేస్తామని ఎంపిడిఒ వై. పద్మజ లబ్ధిదారులను హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కుమ్మరి బంజరిలో లేఅవుట్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆమె మాట్లాడుతూ లేఅవుట్ మంజూరై ఏడాది గడుస్తున్నా ఇంతవరకు పనులు చేపట్టకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా లబ్ధిదారులు పనులు పూర్తి చేయాలని, లేనిపక్షంలో హౌసింగ్ కాలనీ రద్దు చేసి వేరికి ఇస్తామని హెచ్చరించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ త్వరలో పనులు చేస్తామని బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్, వెలుగు, ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు సహకరిస్తేనే అభివృద్ధి పనులు

బొబ్బిలి: నాయుడు కాలనీలో ప్రజలు సహకరిస్తేనే అభివృద్ధి పనులు చేయగలమని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. నాయుడు కాలనీలో రోడ్లు, కాలువలు సౌకర్యం లేని ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, కాలువలు నిర్మాణం చేయాలంటే ప్రజలంతా సమన్వయంతో తమకు సహకరించాలన్నారు. రోడ్లు, కాలువలు నిర్మాణానికి ఎటువంటి అభ్యంతరం లేదని చెపితే ఆలోచించి అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటామన్నారు. పరిసరాల పరిశుభ్రతగా ఉంచాలని కోరారు. ఆయనతో మున్సిపల్ డిఇ రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

బొబ్బిలి: పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటాలని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జెసివి రాజు, వారణాసి శ్రీహరి, పూర్వ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఎస్‌బిఐ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలుష్యం రోజురోజుకు పెరిగిపోవడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. వాహన వినియోగం పెరగడం, కాలుష్య పరిశ్రమలు అధికమవ్వడంతో వాతావరణం సమతుల్యత దెబ్బ తింటుందన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఇళ్ల వద్ద మొక్కలు పెంచేందుకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, ఎస్‌ఇబి సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ పట్టాలపై దర్యాప్తుకు జాయింట్ కమిటీ

బొబ్బిలి: ఇందిరమ్మ కాలనీలో నకిలీ పట్టాలపై సమగ్ర దర్యాప్తుకు జాయింట్ కమిటీ వేస్తామని తహశీల్దార్ డోల రాజేశ్వరరావు చెప్పారు. ఇందిరమ్మ కాలనీలో నకిలీ పట్టాలపై ప్రజాశక్తిలో శుక్రవారం కథనం ప్రచురితం కావడంతో ఆర్డిఒ స్పందించి సమగ్ర దర్యాప్తు చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. దీనిపై తహశీల్దార్ రాజేశ్వరరావు మాట్లాడుతూ నకిలీ పట్టాలపై సమగ్ర దర్యాప్తుకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో జాయింట్ కమిటీ వేసి దర్యాప్తు చేస్తామని చెప్పారు. నకిలీ పట్టాలని నిర్ధారణ అయితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు.

తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే చర్యలు

బొబ్బిలి: ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్ అమ్మకాలపై తల్లిదండ్రులు పిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డిఇఓ బ్రహ్మాజీ అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్ అమ్మకాలపై ఎటువంటి ఫిర్యాదులు రాలేదన్నారు. అలజంగి జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనంపై ఫిర్యాదులు వచ్చాయని, చర్యలు తీసుకోవాలని ఎంఇఓకు ఆదేశించామన్నారు.

గిరిజనులపై దాడులను ఖండించండి

ప్రజాశక్తి- బాడంగి

గిరిజనులపై ఫారెస్టు అధికారుల దాడులను ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి. శంకరరావు అన్నారు. సాలూరు మండలం చింతపల్లి గిరిజనులు ఆ గ్రామంలో ఉపాధి లేక ఆకులుకట్ట ఫారెస్ట్ పరిధిలో పులుగుమ్మి దారి కొండ ప్రాంతంలో చిన్న గుడిసెలు వేసుకుని గత రెండేళ్లుగా నివసిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఫారెస్ట్ అధికారులు శుక్రవారం అన్యాయంగా గిరిజనులను కొట్టి వాళ్ళ గుడిసెలు ధ్వంసం చేస్తూ గిరిజన మహిళల్ని బండ బూతులు తిడుతూ దారుణంగా కొట్టడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సిపిఎం, కాంగ్రెస్ నాయకులు ఆ ప్రాంతానికి వెళ్లి గిరిజనలతో మాట్లాడారు. అక్కడ ఫారెస్ట్ పోలీసులు సుమారు 30 మంది వరకు కాపలా కాచి గిరిజనులను బెదిరించడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆ సమయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి.


నిరసన తెలుపుతున్న నాయకులు, గిరిజనులు

శంకర్రావు, ఎ. సురేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ముచ్చల శ్రీనివాసరావు వెళ్లి గిరిజనులకు అండగ నిలబడినట్లు గిరిజనులు చెబుతున్నారు. ఉన్నపలంగా గిరిజనులను బయటకు వెళ్లమనడం దుర్మార్గమని వీళ్లు ఇక్కడే ఉంటారని తామంతా ఉన్నతాధికారులను కలిసి గిరిజనుల సమస్యలను వివరిస్తామని నాయకులు చెప్పారు. అంతవరకూ గిరిజనులపై ఎటువంటి దౌర్జన్యం చేసినా సహించేది లేదన్నారు. గిరిజన హక్కులను కాలరాసే విధంగా పోలీసులు ప్రవర్తించినా, చట్టపరంగా పౌర హక్కులను భంగం కలిగించే విధంగా వ్యవహరించినా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. 10వ తేదీన బొబ్బిలి ఆర్‌డిఒ ఆఫీస్ ముందు ధర్నా జరిపి వాళ్లకు అక్కడే నివాసం ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని తెలిపారు. అసలు వాళ్ళు గుడిసెలు వేసుకున్న ప్రాంతం వివాదంలో ఉందని, ఇది ఫారెస్ట్ ల్యాండ్ కాదని, తమ రెవెన్యూ పరిధిలో ఉందని పులిగుమ్మి సర్పంచ్ తెలిపారు. ఫారెస్ట్ అధికారులు ఏ రికార్డులూ ఇంతవరకు చూపించలేదని, మరి గిరిజనులను తొలగించే హక్కు ఫారెస్ట్ అధికారులకు ఎక్కడ ఉందని సిపిఎం నాయకులు ఫారెస్ట్ అధికారులు ప్రశ్నించారు. గిరిజనులకు అక్కడే ఉండే హక్కు కల్పించాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు.

దళితులపై చులకన భావం తగదు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

దళితులపై వైసిపి చులకన భావం తగదని ఎస్‌సి, ఎస్‌టి ఐక్య వేదిక నాయకులు కనిగిరి శ్రీనివాసరావు, టొంపల నరసయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు విలేకర్లతో మాట్లాడుడారు. ఇటీవల వైసిపి అధికార ప్రతినిధి పంచ్ ప్రభాకర రెడ్డి దళితులపై చులకన మాటలను ఖండిస్తున్నామన్నారు. వైసిపి నాయకులు దళితులను చులకన చేసి అవమానిస్తే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సంస్కార హీనంగా మాట్లాడి దళితులను కించ పరిస్తే చూస్తూ ఊరుకోమని తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కాగా దళితులు కూడా సమాజంలో భాగస్వామ్యులని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. దళితుల ఓట్లతో గద్దె నెక్కిన వైసిపి వారిపై దాడుల చేసి హత్యలు చేయడం ఆ పార్టీతీరుకు నిదర్శనం అన్నారు. దళితుల పట్ల దాడుల, అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై అట్రా సిటి కేసు నమోదు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించి ఫెర్రో ఎల్లాయిస్ కార్మికులను ఆదుకోవాలని ఫేకర్ జెఎసి నాయకులు అంబల్ల గౌరు నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఫేకర్ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ జెఎసి నాయకులు చీపురుపల్లి ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచడం వల్ల ఫేకర్ యాజమాన్యం పరిశ్రమ నడపలేమని చెప్పి మూసివేతకు సిద్ధమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యూనిట్ రేటు 5 రూపాయల నుంచి 8.50పైసలకు పెంచడంతో పరిశ్రమ మూసివేయడం దిశగా అడుగులు వేయడం కార్మికులు ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమకు కావాల్సిన ముడి సరుకు ఒడిస్సా, ఛత్తీస్ గడ్ వంటి రాష్ట్రాల నుంచి తీసుకు వచ్చి టన్ను తయారీకి రూ. 6వేలు అదనంగా రవాణా ఖర్చు అవుతుందని తెలిపారు. కరెంట్ యూనిట్ 5 రూపాయల నుంచి 8.50 రూపాయలకు పెంచడం భారం పెరిగి మన రాష్ట్రంలో ఖర్చు ఎక్కువగా ఉందని పోటీ వ్యాపారంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే నిలబడలేక పరిశ్రమ మూసివేసే పరిస్థితి ఉంటుందన్నారు. జిల్లాలో 20 పరిశ్రమల్లో 30వేల మంది ఉన్నారని వారు రోడ్డున పడే ప్రమాదం



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ఉందన్నారు. దీని ఫలితంగా గరివిడి ఫేకర్‌లో పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, కార్మికులు, సూపర్ వైజర్‌లు మొత్తం 1500 మంది ఉన్నారని పరిశ్రమ మూసివేస్తే వీరు కూడా రోడ్డున పడతారన్నారు. ఇప్పటికే గరివిడి ఫేకర్ యజమాన్యం ఈ నెల 15 నుంచి శత శాతం లే ఆఫ్ విధిస్తున్నట్లు ప్రకటించి నోటీస్ జారీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించుకొని ఫేకర్ మూత పడకుండా చర్యలు చేపట్టి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పేకర్ ఉద్యోగులు కె.రామారావు. జె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో నిధులు పెంచాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 10, 11 తేదీలలో జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే 36 గంటల దీక్షా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసిడిఎస్ బడ్జెట్‌లో నిధులు పెంచి తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా మార్చాలని, హెల్పర్లు ప్రమోషన్లకు వయసు 50 సంవత్సరాలు పెంచాలని కోరారు. అంగన్వాడీలపై రాజకీయ జోక్యం అరికట్టాలని ప్రీస్కూల్ బలోపేతం చేయాలని, పిల్లలకు అమ్మఒడి యూనిఫామ్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

ఇవ్వాలని, లబ్ధిదారులకు న్యాయమైన ఫుడ్ సరఫరా చేయాలని అన్నారు. సర్వీస్‌లో ఉండి చనిపోతే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ, డిఎలు విడుదల చేయాలన్నారు. వేతనాలతో కూడిన మెడికల్ లీవ్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డి. జయలక్ష్మి, కే. దంతీశ్వరి, ఎం. ధనలక్ష్మి, కె. విజయ, సిహెచ్. బాలగంగా లక్ష్మి, బి. ఉమాదేవి, ఎస్. కె. ఖాదర్ బిబి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ

ప్రజాశక్తి- బొండపల్లి

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలు సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చొరవ చూపడం జరుగుతుందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని గొట్లాం సచివాలయ పరిధిలో గల జియ్యన్నవలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా ఇప్పటికే సుమారు 95 శాతం హామీలను నెరవేర్చడంతో పాటు, చాలా వరకు సామాజిక సమస్యలను పరిష్కరించామన్నారు. ఇంకా మిగిలిన సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చల్ల చలం నాయుడు, జెడ్‌పిటిసి రాపాక సూర్యప్రకాష రావు, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్, తహశీల్దార్ ప్రసాద్‌రావు, ఎంపిడిఒ వైబి.రాజేంద్ర ప్రసాద్, ఇఒపిఆర్‌డి సుగుణాకర్ రావు, వైస్ ఎంపిపిలు మీసాల సరోజిని, గొండెల ఈశ్వరరావు, బొండపల్లి, గొట్లాం, రాచకిండాం పిఎసియస్ అధ్యక్షులు బివి ప్రభూజి, మహంతి రమణ, గొల్లు సతీష్, ఎపిఒ బి.కృష్ణవేణి, ఎపిఎం సులోచనా దేవి తదితరులు పాల్గొన్నారు.

అమ్మఒడితో మరింత ప్రోత్సాహం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అమ్మఒడితో ప్రభుత్వ విద్యను ప్రోత్సహిస్తున్నామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం కొండ వెలగాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అమ్మఒడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్‌బాబు అమ్మఒడి చెక్‌ను విద్యార్థుల తల్లులకు అందించారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను మరింత ప్రోత్సహించడానికి అమ్మఒడి పథకం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా పథకాన్ని ఆపకుండా ఏటా అర్హులైన లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను కార్పొరేట్ ధీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ ఛైర్మన్ చనమల్ల వెంకట రమణ, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాస రావు, బూరాడ పేట ఎంపిటిసి సంగం రెడ్డి జగన్నాధం, చంద్రం పేట మాజీ సర్పంచ్ కర్రోతు వెంకట రమణ, నగర పంచాయతి వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, వైవిపి నాయకులు చిక్కాల సాంబశివ రావు, వైస్ ఎంపిపి పతివాడ సత్యనారాయణ, ఎంపిడిఒ గిరిబాల, తదితరులు పాల్గొన్నారు.

చెరువు గట్టు ఆక్రమణ

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని మిలటరీ కాలనీకు అనుసరించి ఉన్న చెరువు గట్టును కబ్జా చేసేందుకు గుర్తు తెలియని వ్యక్తులు జెసిబితో చదును చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందడంతో తహశీల్దార్ డోల రాజేశ్వరరావు చెరువు గట్టును పరిశీలించి గట్టుగా నిర్ధారణయితే ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు గట్టును పరిశీలించి, ప్రభుత్వ స్థలాన్ని అక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శుక్రవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. చెరువులను, ప్రభుత్వ స్థలాలను అక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రాజేశ్వరరావు హెచ్చరించారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి- బాడంగి

రైతులు చిరు ధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలని ఎఒ కె. శిరీష అన్నారు. మండలంలోని వాడాడ రైతు భరోసా కేంద్రం పరిధిలో ఆమె ఆధ్వర్యంలో శుక్రవారం చిరు ధాన్యాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాగులు, కొర్రలు, కందిలో అంతర పంటలుగా 4 ఎకరాల్లో వేయించారు. ఆమె మాట్లాడుతూ వరి పంటకి ప్రత్యామ్నాయంగా మెట్టు ప్రాంతాలలో చిరు ధాన్యాలు సాగు చేయాలన్నారు. చిరు ధాన్యాల సాగు వాళ్ళ రైతులుకి సాగు ఖర్చులు తగ్గి తక్కువ సమయంలో అధిక దిగుబడితో పంట వచ్చి మంచి ఆదాయం చేకూరుతుందన్నారు. అనంతరం రైతు గొట్టపు రాములు పొలంలో వ్యవసాయ సహాయకులు వాడాడ సాయికుమార్‌తో విత్తనశుద్ధి చేపించారు. కౌలు దారులు ఎవరైనా ఉంటే రెవెన్యూ అధికారుల నుండి కౌలు కార్డులు తప్పనిసరిగా పొందాలని ఈ కౌలు కార్డు ఆధారంగానే రైతులు సాగు చేసే పంట నమోదు తద్వారా వైఎస్ఆర్ సున్నా వడ్డీ, ధాన్యం కొనుగులుకి, పంట బీమా వర్తింపు, ఇతర ప్రభుత్వ పథకాలు పొందడానికి అర్హులుగా గుర్తించబడతారన్నారు. వాడాడ ఆర్‌బికెలో శుక్రవారం నుంచి బొబ్బిలి ఎఇఒ సంబంగి గిరిజాకుమారి ఇంచార్జీ బాధ్యతలు తీసుకున్నట్లు వ్యవసాయ అధికారి శిరీష తెలిపారు.

త్వరితగతిన ఇళ్లు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పునాది స్థాయి ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డిఇ జి. మురళీ మోహన్ సూచించారు. శుక్రవారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలో సతివాడ జగనన్న లేఔట్‌ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సతివాడలో మిగులి ఉన్న అర్హులకు సతివాడ నుంచి దమర సింగి రహదారి పక్కన కొత్త లే ఔట్‌లో స్థలం కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎఇ రేవళ్ల పవన్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని వల్లంపూడిలో జగనన్న హౌసింగ్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటికీ పనులు ప్రారంభించని వారి స్థలాలను వెనుక్కు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ, తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపిడిఒ పట్నాయక్, సర్పంచ్ అంజలి, జెడ్‌పిటిసి ఎస్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సరిపడా విత్తనాలు సరఫరా చేయండి

ప్రజాశక్తి - కొత్తవలస


మాట్లాడుతున్న సర్పంచ్ రామస్వామి

ఈ ఏడాది వరి విత్తనాలు రైతులకు సరపడా సరఫరా చేయాలని కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి వ్యవసాయ అధికారులను కోరారు. కొత్తవలస పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరిపడా విత్తనాలు అందించడానికి వ్యవసాయ అధికారులు కృషి చేయాలని కోరారు. గతేడాది సరైనా సమయంలో వరి విత్తనాలు అందక రైతులు నానా అవస్థలు పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాదైనా సకాలంలో వరి విత్తనాలు అందించాలని కోరారు. వచ్చే వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత శాఖను కోరారు. ఎన్ఇఆర్‌జిఎస్ పరంగా చేపట్టిన పనులు వేగవంతం చేయాలని సర్పంచ్ కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి సిహెచ్ కన్నబాబు, వార్డు మెంబర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ ఆత్మహత్యాయత్నం

నేరాలు ఘోరాలు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలోని ఆరికతోట పంచాయతీలో గత కొన్ని నెలలుగా గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న వర్రి గౌరు శుక్రవారం పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. తోటి వర్కర్లు, కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు వీరికి గత 10 నెలలు నుంచి సక్రమంగా వేతనాలు రావడం లేదు. ఇటీవలే 10 నెలలకు 3 నెలల వేతనాలు బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. కుటుంబ పోషణ కోసం ప్రైవేట్‌గా ఈ వేతనాలు ఆశ చూపి అప్పులు చేశారు. ఇప్పుడు వేతనాలు జమ కావడంతో అప్పులు ఇచ్చిన వాళ్ళు వసూళ్ల కు రావడం తో గౌరు ఆవేదన చెందాడు. వచ్చిన వేతనం చేసిన అప్పులు తీర్చడానికి కూడా సరిపోదని ఇలా ఐతే జీవన భృతి ఎలా అని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలా జీతాలు సక్రమంగా రాకపోతే పనిలోకి వెళ్ళమని పంచాయతీ అధికారికి, సర్పంచ్‌కు తెలియజేశారు. అయితే వీరు సర్పంచ్ వద్ద కూడా అప్పులు చేయడంతో పనికి రాకపోతే అప్పు తీర్చి మానెయ్యవచ్చు అని లేదా పనులు చేస్తే అడ్వాన్స్‌గా మరికొంత మొత్తం ఇస్తామని చెప్పినట్లు సర్పంచ్ పుష్పమ్మ తెలిపారు. ఇదే వేదనతో కకావికలం ఐన మనస్సుతో గౌరు పురుగుమందు తాగాడు గమనించిన తోటి సిబ్బంది హుటా హుటిన బాడంగి సిహెచ్‌సికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాసుపత్రికి రిఫర్ చేశారు. దీనిపై ఎస్ఐ సురేంద్ర నాయుడు దర్యాప్తు చేపట్టారు.

155 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలో ఎస్ఐ జె.తారకేశ్వరరావు తన సిబ్బంది తో కలిసి శుక్రవారం వాహనాల తనిఖీ చేస్తుండగా అరకు ఏజెన్సీ వైపు నుండి ఎస్‌కోట వస్తున్న ఇన్నోవా వాహనాన్ని తనికీ చేశారని ఇంఛార్జి సిఐ సూర్యారావు తెలిపారు. ఈ తనికీలో 155 కేజీల గంజాయి పట్టుబడిందని, గంజాయిని రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వెల్లడించారు. పోలీసు స్టేషన్ ఆవరణలో ఎస్.ఐ తారకేశ్వరరావు, పోలీసు సిబ్బందితో కలిసి ఇంచార్జ్ సీఐ బాల సూర్యారావు శుక్రవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రంలోని మల్కనగిరి జిల్లా మూలపుట్టు గ్రామానికి చెందిన రామనాథ్‌కిల్ అనే వ్యక్తి తన కొండ పోరంబోకు భూమిలో పండించిన 155 కేజీల గంజాయిని మహారాష్ట్రలోని బిల్వండి అనే ప్రాంతానికి చెందిన ఫరూక్ ఖురేషి, అతీక్ అహ్మద్ రఫిక్ షేక్‌లకు అమ్మకం చేశాడు. మహారాష్ట్ర వారికి ఆంధ్రప్రదేశ్ కొత్త కాబట్టి విశాఖ వరకు ఇన్నోవా వాహనంలో దారి చూపేందుకని గంజాయిని అమ్మిన రామనాథ్‌కిల్ వచ్చాడని తెలిపారు. ఈ కొనుగోలు చేసిన 155 కేజీల గంజాయి విలువ సుమారు రూ.6.20 లక్షలు ఉంటుందని చెప్పారు. గంజాయిని పండించడం, రవాణా చేయడం నేరం కాబట్టి ముగ్గురు నిందితులను అరెస్టు చేయటంతో పాటు ఇన్నోవా వాహనం, మూడు సెల్ ఫోన్లు సీజ్ చేశామన్నారు.

మందుబాబుల కొట్లాట

శృంగవరపుకోట: బొడ్డవర ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద ఇద్దరు మందుబాబులు బీరు సీసాలతో శుక్రవారం కొట్టుకోవడంతో ఇరువురికి గాయాలయ్యాయి. ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం. మండలంలోని పెదకండేపల్లి గ్రామానికి చెందిన ఏర్నాయుడు, అంబాదాసు పాలానికి చెందిన లగుడు ఈశ్వరరావు మధ్య వాగిద్వాగం జరిగింది. దీంతో వారు తమ చేతుల్లో ఉన్న బీరు సీసాలతో తలలపై కొట్టుకోవడంతో ఇరువురికి గాయాలయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

గుర్ల : మండలంలో కెల్ల గ్రామంలో శుక్రవారం అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసికిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హరిబాబు నాయుడు తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం ప్రకారం కెల్ల గ్రామంలో సోదాలు నిర్వహించగా 185 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భూ తగాదాలో కేసు నమోదు

లక్కవరపుకోట: మండలంలోని గొల్జాం గ్రామ పంచాయతీలో చోటు చేసుకున్న భూతగాదాల్లో స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరిహద్దు విషయంలో గ్రామంలో జరిగిన తగాదాలలో గొల్జాం గ్రామానికి చెందిన తూర్పాటి రాంబాబు, అప్పలరామకృష్ణలు తనను కొట్టి గాయపరిచారని విశాఖ జిల్లా మింది గ్రామానికి చెందిన గోకాడ లక్ష్మి ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై ఆమె అక్క సంతపేట ఎంపిటిసి కలవలపల్లి సత్యవతిని ముందురోజు దూషించారని పేర్కొన్నారు. తనను కొట్టడమే కాకుండా చంపుతానని బెదిరించడంతో చేసిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కొండబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

చంపేసి పడేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ

డెంకాడ: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా విజయనగరం నాతవలస ఆర్ అండ్ బి రోడ్డు పక్కన టిడిపి కార్యాలయం వద్ద అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని చొల్లంగిపేట గ్రామానికి చెందిన వాతాడ శేఖర్ (28) గురువారం సాయంత్రం 4 గంటలకు ఇంటి నుంచి రూ.50 వేలు పట్టుకొని తన మోటారు సైకిల్‌పై బయటకు వెళ్లాడు. 7 గంటల ప్రాంతంలో సెల్ఫోన్ రింగ్ అయినా లిఫ్ట్ చేయలేదు. మృతుడు పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామంలో బ్యాంకులో పనిచేస్తున్నాడు. లావాదేవీలు ఎక్కువగా చేస్తుంటాడని ఆ కోణంలోనే తన దగ్గరున్న రూ.50 వేలు తీసుకొని ఎవరో కొట్టి చంపి ఇక్కడ పడేసారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా మృతునికి ఏడాది క్రితం వివాహమైంది. భార్య వాణి కుమారితో పాటు 45 రోజుల బాబు, తల్లితండ్రులున్నారు. కుటుంబాన్ని పోషించాల్సిన కుమారుడు అభ్యంతరంగా చనిపోవడంతో తల్లిదండ్రులు భార్య కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.